


"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

# మునక

సుంకోజి దేవేంద్రాచారి, కడప, ఆంధ్ర ప్రదేశ్

**చల్ మంటూ కోడెగిత్తను** తాకిన చెర్నాకోల శబ్దంతో ఉలికిపడ్డాడు వీరయ్య.

"ఎన్ని సార్లు పిల్చాల నాయనా నిన్ను.. చెర్నాకోలతో ఎద్దును కొట్టే శబ్దం తప్ప నీకు ఇంకేదీ ఇనిపించదా" విసుగ్గా ప్రశ్నించాడు కొడుకు శివ.

"ఎద్దలను అట్ల కొట్టగాకురా అని ఎన్నిసార్లు చెప్పాల నీకు" వీరయ్య ముఖంలో కోపం,

"మనుషులే ఇనడంలా.. గొడ్డును కొట్టకుంటే మన మాటింటాదా.."

"వాటిని కొట్టే అవసరం ఏమొచ్చిందిరా..? నోరులేని జీవాలు.. వాటిని హింస పెట్టొద్దు. ఆ పాపం ఊరికే పోదు" వీరయ్య స్వరంలో తీవ్రత పెరిగింది.

"పాపం పున్నెం.. ఇంగా ఏ కాలంలో ఉండావు నాయనా.. ఇప్పుడుండేదంతా ఒకటే కాలం.. డబ్బుల కాలం. డబ్బుంటే చాలు. ఏం చేసినా పున్నెమొస్తాది.. పేరొస్తాది.. పాపం అనేదే లేదు. టైము పదిగంటలయితాంది. టిఫన్ తినుపో. చేసి పెడితే టయానికి తినకుండా మాటలొకటి.." అన్నాడు వ్యంగ్యంగా శివ.

శివకు 45 ఏళ్లు. ఐదున్నర అడుగుల ఎత్తు. నలుపు రంగు. బాగా దృఢంగా ఉన్నాడు. నైట్ ప్యాంట్, టీషర్ట్ వేసుకోనున్నాడు. నుదుటన బొట్టు ఉంది. రెండు చేతులకు కలిపి నాలుగు వేళ్లకు బంగారు ఉంగరాలున్నాయి. కుడిచేతికి బ్రాస్ లైట్ ఉంది. అతను కడపలోని తెలుగుగంగ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు.

ఈ ముసలాయన ఎప్పుడూ ఇంతే అని మెల్లిగా గొణిగినట్టుగా అని “పో తాతా.. పొయ్యి తినుపో.." అన్నాడు అహ్మద్.

అహ్మద్ ముఖంలోకి చూశాడు వీరయ్య. "అన్న చెప్పింది ఇను తాతా.. కడపలో చర్చి తిరణాల జరగతాండాది. రేపు పద్దన్నే బండలాగుడు పోటీలుండాయి. ప్రైజు ఎంతనుకోనుండావు? లక్ష.. లక్షరూపాయలు. మన ఎద్దులే ఫస్ట్ వస్తాయి. ఆ మాదిర్తో ట్రైనింగ్ ఇచ్చినా.. రేపు మన ఎద్దులు ప్రైజ్ గెల్చుకోనొచ్చినాక మజా ఉంటాదీ.. ఇప్పుడు ఇంగోసారి ఎద్దలతో ప్రాక్టీస్ చేపించాల. రేపు అందరం పోదాం" అన్నాడు అహ్మద్.

వీరయ్య దాదాపు ఐదున్నర అడుగుల ఎత్తున్నాడు. చామనచాయ. పల్లెలో పొలం పనులు చేసేప్పుడు బాగా నల్లగా ఉండేవాడు. ఇప్పుడు నీడపట్టున ఉండటంతో కాస్త రంగు వచ్చాడు. వయసు 75 ఏళ్లు. కట్టె మనిషి, భార్య ఉన్నప్పుడు రోజూ గేదెలను మేపుకుని వచ్చేవాడు. ఆమె చనిపోయాక గేదెలను అమ్మేయడంతో ఇప్పుడు ఏ పనీ లేదు. ఏ పని చేయాలనే ఆసక్తీ వీరయ్యకు లేదు. జీవితం నిస్సారంగా ఉంది.

కోడెగిత్తల వద్ద చెర్నాకోలతో నిలబడుకోనుండే కొడుకును.. బండలాగేదానికి శిక్షణ ఇచ్చేదానికి వచ్చిన అహ్మద్ ను తేరిపార చూసి ఇంట్లోకి పోయాడు వీరయ్య,

మధ్యాహ్నం వంటకు ఎర్రగడ్డల పొట్టు తీస్తున్న కోడలు వీరయ్యను చూడగానే లేచి "రా మామా.. నేను నాలుగైదు సార్లు పిల్చినా.. నువ్వు పలకలా.. దోసెలు పోసేసి హాట్ బాక్స్ లో పెట్టేసినా. కుచ్చో తెస్తా" అని కిచెన్లోకి పోయింది.

వీరయ్య వాష్ బేసిన్ లో చేయి కడుక్కుని వచ్చి సోఫాలో కూర్చున్నాడు. శాంత గిన్నెలో రెండు దోసెలు, కారము, చెట్నీ వేసుకుని తెచ్చి వీరయ్య ఎదురుగా స్టూలుపైన పెట్టింది.

వీరయ్య కోడలితో ఒక్కమాట కూడా మాట్లాడలేదు. మౌనంగా దోసెలు తినడం మొదలు పెట్టాడు. తింటున్నాడే కానీ.. ఆలోచనలు ఆర్నెళ్ల వెనక్కు వెళ్లాయి. ఆ రోజు కొడుకుతో జరిగిన వాగ్యుద్ధం అంతా మరోసారి కళ్లముందు మెదిలింది.

సాయంత్రం కాగానే వీరయ్య రోజూ ఏదో ఒక గుడికి పోతాడు. శుక్రవారం పెద్ద దర్గాకు, ఆదివారం చర్చికి, మిగతా రోజుల్లో రాముని గుడికి, శివుని గుడికి, ఆంజనేయ స్వామి గుడికి పోతాడు. సాయిబాబా గుడికి వారంలో రెండు రోజులు

తప్పనిసరిగా పోతాడు. మనవడు మనవరాలు ఇంట్లో ఉండి చదువుకునేటప్పుడు, తన భార్య బతికున్నప్పుడు వీరయ్య గుడులకు పెద్దగా పోయేవాడు కాదు. గుడికి పోయేంత తీరిక లేదనేవాడు. ఇప్పుడు పొద్దుపోవడానికి దీనినే మార్గంగా ఎంచుకున్నాడు. ఏ గుడికి పోయినా.. కొడుకు రాత్రి ఇంటికి వచ్చేప్పటికి వచ్చేస్తాడు. ప్రతి రోజూ కొడుకుతో కలసి భోజనం చేయడం వీరయ్య అలవాటు. అలా రాత్రి ఎనిమిది గంటల సమయంలో కొడుక్కోసం ఎదురుచూస్తుండగా.. శివ వచ్చాడు. ఇంట్లోకి అడుగు పెట్టగానే "నా జాతకం ప్రకారం 50 ఏళ్ల వయసు వచ్చేప్పటికి పశువులతో కీర్తి ప్రతిష్టలు, సంపద వస్తాయంట" చెప్పాడు. ఆ మాటలు వినగానే వీరయ్య కొడుకును ఆశ్చర్యంగా చూశాడు.

“అవున్నాయనా.. మా ఆఫీసుకు ఒకాయన వచ్చినాడు. ఆయనే నా డేటాఫ్ బర్త్ చూసి జాతకం చెప్పినాడు. పశువులతో నాకు కీర్తి ప్రతిష్టలు, సంపద వస్తాయంట" ఉత్సాహంగా చెప్పాడు సోఫాలో కూర్చుంటూ.

“శివా.. అట్లాటియి ఏవీ నమ్మద్దు. నీకు ఉద్యోగం ఉంది. నెల జీతం వస్తాంది. ఇద్దురు బిడ్డలు. బాగా చదువుకుంటా ఉండారు. బంగారట్లా భార్య. సొంతిల్లు ఉండాది. బిడ్డల చదువు పూర్తయ్యి వాళ్లకూ ఉద్యోగాలొస్తే.. అంతకంటే మంచి జాతకం ఏముంటాది" అన్నాడు వీరయ్య కొడుకుతో.

"లేదు నాయనా.. మనం ఏదో ఒకటి చేయాల. రిటైర్మెంట్ దాకానే ఉద్యోగం. మళ్లయినా ఏదో ఒకటి చేయాల్సిందే కదా" ఆలోచిస్తున్నట్టుగా అన్నాడు శివ.

“ఏం చేస్తాం.. మనకుండే పొలం సోమశిల నీళ్లమునకలో పాయ. పొలం ఉన్నే ఇప్పుడు ఎద్దులతో ఎవురూ సేద్య చేయడం లేదు. నాట్ల కాన్నింటి కోతలదాంకా అన్నీ మిషన్లే.. పొలం, ఇల్లు పోయాలకు ఉండూరు వదిలేసి ఈడికొచ్చి చేరుకున్నేం. సేద్యం చేసిన బతుకులు కదా.. నేనూ మీ అమ్మా పదేండ్లకు పైగా గేదెలు మేపి పాలు పోస్తిమి. మీ అమ్మ కాలం చేసినాంక.. నేనొగడినే చేయలేనని గేదెలు అమ్మేసినావు. ఇంక నీకు పశువులతో కీర్తి, సంపద ఎట్లొస్తాది"

"అదే ఆలోచిస్తాండా.."

"కొండకింద పదిసెంట్ల జాగా కొన్నేం కదా.. ఆడ షెడ్డేసి 20 గేదెలు పెడతావేమో చూదు"

"ఛ ఛ.. అట్లా పనొద్దు నాయనా.. గేదెలకు ఎంత చాకిరీనో చూసినా.. మీ కోడలికి ఆ పేడ వాసనే పడదు. నాకు ఉద్యోగం. పిల్లోళ్లు బయటూర్లో చదువుకుంటా ఉండారు. ఇంట్లో ఇంగ గేదెలు వద్దు.. నాకొగ ఆలోచన వచ్చింది"

ఏందది అన్నట్టుగా కొడుకు ముఖంలోకి చూశాడు వీరయ్య.

"ఇక్కడ సంక్రాంతి పండగకు, ఉగాదికి, తిరనాళ్లకు, జాతర్లకు, పెద్దోళ్ల పుట్టిన రోజులు, పెండ్లి రోజులకు బండలాగుడు పోటీలు పెడతాంటారు. మనంగూడా చానాసార్లు పోయి చూసినాం" అన్నాడు శివ ఉత్సాహంగా, అప్పటికే తనేమి చేయాలో నిర్ణయం తీసుకున్నట్టు ఉంది అతని ముఖం.

"మనం చానా సార్లు పోలా.. నువ్వు పోయినావు. నేను ఒగసారే వచ్చినా.. ఆ బండను ఎద్దల మెడకు కట్టి చెర్నాకోలతో కొడతా తరమతారు. అదేమి పందెంరా..?! నోరు లేని పశువులను అట్ల హింస పెట్టొచ్చా" ప్రశ్నించాడు వీరయ్య.

“తప్పేముంది.. మనం ఊర్లో సేద్యం చేసింది పశువులతోనే కదా.. పొలం దున్నేదానికి, గింజలు వేసేదానికి ఎద్దులను వాడుకున్నేం. పంట పండినాక బండిలో వడ్లు ఏసుకోని ఇంటికి తెస్తాన్నేం. అంతంత బరువులు ఏసి.. అయ్యి బండి లాగలేకపోతే కొడతాన్నేం... అప్పుడు తప్పులేదా?" తెలివిగా ప్రశ్నించాను అనుకున్నాడు శివ.

కొడుకు ముఖంలోకి కోపంగా చూసి "బండి లాగేది, బండలాగేది ఒకటి ఎట్లయితాది?" అన్నాడు వీరయ్య.

"నా లెక్కలో రెండూ ఒకటే. రెండుతావలా బరువు లాగడమే పని. లాగలేకపోతే లాగేదాకా కొట్టాల్సిందే" తీర్మానించాడు శివ.

వీరయ్య తల అడ్డంగా ఊపుతూ.. "రెండూ ఒకటి కాదు.. బండి లాగేది మన కడుపులు నిండేదానికి.. వాటి కడుపులూ నిండేదానికి. బండ లాగేది కేవలం మన జేబులు నిండేదానికి.. మనం గొప్ప అని అందరికీ చెప్పేదానికి, రెండూ ఒకటి కాదు" అన్నాడు. మెల్లగానే ఆ మాటలు అన్నా.. వాటిలో స్థిరత్వం ఉంది.

"నాయనా.. నీకు అర్థం కాదులే.. చూస్తాండు. నీకొడుక్కు ఎంత పేరొస్తాదో. ఆంధ్రా తెలంగాణలో మన పేరు మార్మోగిపోవాల" అన్నాడు మీసం మెలేస్తా శివ.

"నా మాట వినరా.. బండలాగుడు పోటీలు ఒక్కసారి చూసిందానికే నా మనసుకు ఎట్లో అయిపోయింది. ఆ బండను ఇరవై మీటర్లు లాగితే ఏమి, నూరు మీటర్లు లాగితే ఏమి? రెండు నిమిషాల్లో లాగితే ఏమి? ఇరవై నిమిషాల్లో లాగితే ఏమి? దేనికి పనికొస్తాది..? ఆ మూగ జీవాలకు రెండు పక్కలా నలుగురు మనుషులు నిలబడుకోని చెర్నాకోళ్లతో కొడతా గట్టిగా కేకలేస్తా పరిగెత్తిస్తాంటే వాటి కండ్లల్లోనే కాదు.. నా కండ్లల్లో కూడా నీల్లొచ్చినాయి.. అట్లా పని ఒద్దురా. మనది రైతు కుటుంబం. మన కుటుంబాల్లో పశువులు, మనుషులూ వేరు కాదు. ఇట్లా పని చేయకూడదు" అన్నాడు. ఆవేదనగా వీరయ్య.

"రైతు కుటుంబం నీదు. మనది కాదు. నాది ఉద్యోగస్తుడి కుటుంబం" బదులిచ్చాడు శివ గర్వంగా.

"నీకు ఉద్యోగం ఎట్లొచ్చింది అనుకోనుండావు. నువ్వేమన్నా కష్టపడి బాగా చదివి పరీక్షలు రాసి ఉద్యోగం తెచ్చుకోనుండావా.? మీ తాతా అవ్వా కష్టపడి ఐదెకరాలు సంపాదించినారు. దాంట్లో సేద్యం చేసినారు. నేనూ మీ అమ్మా ఆ పొలంలో కష్టపడి ఐదెకరాలను పదెకరాలు చేసినాం. సెంటు భూమి లేని మా అమ్మానాయన ఐదెకరాలు సంపాదించడం ఎనకాల, ఐదెకరాలను మేము పదెకరాలు చేయడం ఎనకాల గొడ్డ కష్టం కూడా ఉండాది. అవీ మాతోపాటు గొడ్డు కష్టం చేస్తేనే ఆ మాత్రం నేల వచ్చింది. సోమశిల నీటిమునకలో పదెకరాల పొలం, మన ఇల్లూ

పోయినాయనే గవర్నమెంటు నీకు ఉద్యోగం ఇచ్చింది. లేకుంటే నీకు ఉద్యోగం యాట్నించొస్తాది? మునకలో ఎకరా రెండెకరాలు పోయిన రైతులకు ఇప్పటికీ ఉద్యోగాలు రాలేదు. వాళ్లు కాగితాలు పట్టుకోని దినమ్మూ ఇంగా ఆఫీసు చుట్టూ తిరగతానే ఉండారు. పేరుకోసరం గొడ్లను కష్టపెట్టే పనిచేయొద్దు నాయనా.. నా మాటిను" అన్నాడు వీరయ్య.

"మామ చెప్పేది ఇనుబ్బా. మనకెందుకు ఆ పోటీలు. ఆ ఎద్దలను సాకేదానికి చానా కర్చంట కదా. ఒగోసారి ఎద్దల పాణం కూడా పోతాదంటనే" అంది శివ భార్య శాంత.

"నోర్మూస్తావా.. తెచ్చేసింది తిని ఇంట్లో పడుండు. నోరెత్తినావంటే.. నీ.." కుడిచేతి చూపుడు వేలు చూపిస్తూ భార్యను బెదిరించాడు శివ.

"మామా.. ఇంకో దోసె వేసేదా" అడిగింది కోడలు. వీరయ్యకు ఆ మాటలు వినిపించలేదు.

చల్.. అనే చెర్నాకోల శబ్దంతో ఉలిక్కిపడ్డాడు. ఎదురుగా కోడలు నిలబడుకొని ఉంది. అప్పటికే గిన్నెలోని దోసెలు రెండూ తినేశాడు.

"ఇంకో దోసె వేసేదా" మళ్లీ అడిగింది కోడలు.

వద్దన్నట్టు తల అడ్డంగా ఊపి గిన్నెలో చేయి కడుక్కున్నాడు. మరోసారి చెర్నాకోల శబ్దం వినిపించింది. కోడెగిత్తలు అటూ ఇటూ కదులుతున్న చప్పుడు. షెడ్డులోంచి కొడుకు మాటలు వినిపిస్తున్నాయి.

"అహ్మద్.. తాడు జారిపోకుండా కట్టు" శివ.

"నాకు చెప్పాల్నా.. నేను ముడేస్తే ఆ దేవుడొచ్చి ఇప్పినా ఊడదు" అహ్మద్.

"స్టార్ట్ చేద్దామా.."

"స్టార్ట్.. ఆః... పాండి"

చెర్నాకోలతో రెండు చరుపులు. కోడెగిత్తలు బుసలు కొడుతూ ముందుకు కదిలాయి. వాటితో పాటు ఉండే ఐదారుమంది "హై.. హై.. పాండి పాండి.. స్పీడు.. ఇంగా స్పీడు. లాగాల, లాగాల" నేలమీద రెండు టన్నుల బరువుండే బండ గరగరా అంటూ కదులుతున్న శబ్దం.

మాటలు అరుపులు చెర్నాకోల శబ్దమూ దూరమయ్యాయి. అవన్నీ ఐదు నిమిషాల్లో మళ్లీ దగ్గరయ్యాయి. కాసేపట్లో మళ్లీ దూరమయ్యాయి. బయట కోడెగిత్తలకు రెండు టన్నుల బరువుండే బండరాయిని కట్టి ప్రాక్టీస్ చేపిస్తున్నారు. వీధిలో వచ్చి పోయే వాళ్లు, చుట్టుపక్కల ఇళ్లల్లో వాళ్ళు.. కోడెగిత్తలను కొట్టడం, అవి బుసలు కొడతా బండను లాగడం ఆసక్తిగా చూస్తున్నారు.

సోఫాలో కళ్లు మూసుకుని కూర్చుని ఉన్నాడు వీరయ్య. బయట హంగామా అంతా వింటున్నాడు.

"ఏమాలోచిస్తాందావు మామా" అంది శాంత, కింద కూర్చుని ఎర్రగడ్డల పొట్టు తీస్తూ.

"నేనూ ఒగసారి ఎద్దలను రక్తాలు కారేటిగా కొట్టినా" అన్నాడు కళ్లు మూసుకునే వీరయ్య.

మామ వైపు ఆశ్చర్యంగా చూసింది శాంత, వీరయ్య ఏదో మైకంలో ఉన్నట్టు కళ్లు మూసుకునే మాటలు కొనసాగించాడు.

"దాదాపు యాభై ఏండ్లయితాంది. నాకు పెండ్లి కాలా. మా అక్క తొలి కాన్పు కోసం వచ్చింది. అప్పట్లో ఆస్పత్రులు తక్కువ. ఉన్నే దూరం. ఊర్లోనే మంత్రసాని కాన్పు చేసేది. అక్కకు నొప్పులు మొదలైనాయి. కాన్పు కాలా, ఎడ్లబండిలో తిప్పితే కాన్పయితాదని చెప్పినారు. బండిలో దొల్ల ఏసి దాంట్లో అక్కను పడుకోబెట్టినారు. నేనే బండి తోలినా. మంచి కోడెగిత్తలు. ఇంట్లోనే పుట్టి పెరిగినాయి. గంటకు పైగా వంకలు, ఓనెల్లో బండి తోలినా... ఎక్కడా నిమిషం ఆగకుండా పరుగులు పెట్టించినా. బిడ్డ బయటకు రాక అక్క కేకలు. కేకలు ఇనేలకు నేను గిత్తలను ఒగటే మోపన చెర్నాకోలతో కొట్టినా. అక్కకు బండిలోనే కాన్పయింది. ఇంటికొచ్చి బండి ఆపేలకు.. గిత్తలు ఆయాసంతో తల వాలాడేసినాయి. వాటి ఒళ్లంతా రక్తాలు కారేటిగా వాతలు తేలినాయి. నా కండ్లల్లో బొటనేళ్లావుతో నీళ్లు కారినాయి. ఏం చేయాల.. అక్కను బిడ్డను కాపాడుకోవాలంటే వేరే దారిలేదు.. అయ్యా అర్థం చేసుకున్నేయి"

వీరయ్య కళ్లు మూసుకునే ఉన్నాడు. ఆయన కళ్ల నుంచి నీళ్లు కారుతున్నాయి. వాటిని తుడుసుకోవాలనే ధ్యాస లేనట్టుంది. తిరిగి మాట్లాడటం మొదలు పెట్టాడు.

"ఐదెకరాలను పదెకరాలు చేసినామంటే.. ఎద్దల కష్టం ఎంతుండాదని.. గొడ్డుకష్టమని ఊరికే అనలా పెద్దోళ్లు. అవేమి ఆశిస్తాయి మననింటి.. యాళకు ఇంత తిండే కదా.. అయ్యి చేసే కష్టం.. మనసలనింటీ అయితాదా? నా చిన్నప్పుడు కపిల తోలతాంటిమి. తెల్లారుజాము నుంచే మొదలు పెట్టి పద్దన్నే పది పదకొండు గంటల దాకా కపిల తోలినా హుషారుగానే ఉండేటియి. అదునుకు గింజలు ఏసేదానికి నిలికిడి లేకుండా రోజంతా పొలం దున్నినా.. అలిసిపోయి తల వాల్చేటియి కాదు. ఎండాకాలంలో అడివికి పోయి రెండుమూడు దినాలు అన్నే ఉండి బండి నిండుకూ కట్టెలు ఏసుకొస్తాంటిమి. పంటలు పండినాక గింజలు ఇంటికి తెచ్చేది బండిలోనే. వడ్లను మిషనుకు తీసకపోయి ఆడించుకోనొచ్చేది బండిలోనే.. అంతెందుకు.. మా అక్కకు పెండ్లయినాంక.. అత్తగారింటికి తీసకపోయింది కూడా ఎద్దల బండిలోనే. మా కష్టం సుఖం అన్నింటిలో ఎద్దులున్నేయి. మనం పదిరూపాయలు మిగిలిచ్చుకున్నేమంటే.. దాంట్లో మనది పది పైసల కష్టముంటే.. ఎద్దలది తొంభై పైసల కష్టముండాది.. వాటికి గన ఆస్తి హక్కుంటే, మనసలకంటే వాటికే ఎక్కువుంటాది. ఎద్దులుండేది మనకు కష్టం తగ్గించేదానికి. ఎవురో మెచ్చుకోవాలని మనం వాటిల్ని కష్టపెట్టడం పాపం"

వీరయ్య మాటలు ఆపేశాడు. శాంత కూడా వంటపని ఆపేసి మామ చెప్పే మాటలు వింటా ఉంది.

వీరయ్య బుగ్గల మీద కారిన కన్నీటిని తుడుచుకుని కోడలిని చూసి నవ్వాడు. ఆ నవ్వులో విచిత్రమైన భావం. దానిని చెప్పడానికి ఎంత గొప్ప భాషా పండితుడికైనా పదాలు దొరకవు.

"నేను పుట్టి పెరిగిందంతా టౌన్లోనే. మాకు పశువులంటే గేదెలే. వాటి పాలు బాగుంటాయి. వెన్న ఎక్కువ వస్తాది. నెయ్యి చానా అయితాది. రుచిగా ఉంటాది. ఆవు పాలు బాగుండవు. అంతకు మించి మాకేం తెలీదు" చెప్పింది శాంత.

"మా చిన్నప్పుడు నాటావులు ఉన్నాయి. మీరు ఇప్పుడు తాగతాండేది జెర్సీ ఆవు పాలు. నాటావు పాలు చానా బాగుంటాయి. ఆ వాసనే కమ్మగా ఉంటాది. వాటి ముందు ఎనుము పాలు యాడపోవాల. నాటావులు ఉన్నాయంటే.. వాటికి పుట్టే కోడెదూడలు సేద్యానికి పనికొస్తాయి. పెయ్యదూడలు పుట్టినాయంటే ఇంటికి లక్ష్మి వచ్చినట్టే. పనికి రానిదనేదే ఉండదు. ఇప్పుడు ఎనుములకు, జెర్సీ ఆవులకు కోడెదూడలు పుడితే ఏంచేస్తారు..? కొంచెం పెద్దయినాంక కటికంగడికి అమ్మేస్తారు. మా అక్క కాన్పుకోసం బండికి కట్టిన ఎద్దులున్నేయే.. అయ్యి మనింట్లోనే పుట్టి పెరిగినాయి. అయ్యి ముసిలియి అయిపోయి సచ్చిపోయినాంక.. మన పొలంలోనే పూడ్చి పెట్టినాం. మా చిన్నప్పుడు రైతులకు పశువులంటే జంతువులు కాదు.. ఇంట్లో మనుషులు" అన్నాడు వీరయ్య.

"పశువులతో మాకు అనుబంధం లేదు మామా.. కానీ నీ కొడుకు ఆ ఎద్దలను అట్ల కొడతా, బండలాగేది ప్రాక్టీస్ చేపించేది నాక్కూడా నచ్చడం లేదు" అంది శాంత.

"రోజులు మారతాండాయి. వానలు అదుపు తప్పతాండాయి. కరువులు ఈపులమింద ఎక్కిండాయి. సేద్యం నమ్ముకుంటే బతికేది కష్టమని వాన్ని టౌనుకు పంపించి చదివించినాం. మా ఖర్మగాలి ఆ ఊరు, పొలాలు నీళ్లమునకలో పాయ. లేకుంటే ఈడికొచ్చి ఎందుకున్నింటాము. వాడు ఏదో ఒగ చిన్న ఉద్యోగం తెచ్చుకోని టౌనులో కాపరం పెట్టినా.. నేనూ మీ అత్తా పల్లెలోనే ఉన్నింటాం. పల్లెలో ఉన్నింటే మీ అత్త ఇంగా కొన్నేండ్లు బతికేదేమో" అన్నాడు వీరయ్య. ఆయన గొంతులో దు:ఖపు జీర.

కాసేపు ఇద్దరి మధ్యా మాటల్లేవు. తిరిగి వీరయ్యే మాట్లాడ్డం మొదలు పెట్టాడు. "ఒగడే కొడుకని కష్టం తెలీకుండా పెంచినాం. కష్టం తెలీకుంటే పోయింది.. పశువులు, మనుషుల మనసు తెలుసుకోకపోతే ఎట్ల? నా సంతోషం కోసం ఏమైనా చేస్తా.. ఎదుటి పాణాలు ఏమైతే నాకేం అనుకుంటే ఎట్ల? అందరిలో ఈ తీరు పెరిగితే ఏమైపోతాది ఈలోకం... ఎవరైనా మళ్ల శాంతంగా సుఖంగా ఉండేదానికి అయితాదా?" వీరయ్య వేసిన ఈ ప్రశ్నలు కేవలం తన కొడుకును ఉద్దేశించి మాత్రమే కాదు.

"ఏం చేద్దాం మామా.. చెప్తా ఉంటే ఆయన ఇంటాండాడా? నీ మాటే ఇనడం లేదు. నన్ను మనిషిగానే చూడడు. పిల్లోళ్లనూ అట్లే తయారు చేస్తాండాడు" శాంత పంటిబిగువున దుఃఖాన్ని ఆపుకుంది. అయినా ఆమె కనుకొలకుల్లో రెండు నీటి బొట్లు నిలిచాయి.

అవునన్నట్టు తలూపాడు వీరయ్య.

"టీ పెట్టు.." అంటూ ఇంట్లోకి వచ్చిడు శివ. ఎర్రగడ్డలు ఎదురుగా పెట్టుకోనుండే భార్యను చూసి "ఇంగా కూర చేయలేదా.. ఏం పీకతాండావు పద్దట్నించీ" అన్నాడు కోపంగా.

"అన్నీ రెడీ చేసుకున్నే. పన్నెండుకంతా వంటయిపోతాది" అంటా ఎర్రగడ్డలు చాటలో వేసుకుని లేచింది శాంత.

"మొత్తం ఆరుమందికి టీ పెట్టు" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

శాంత వంటగదిలోకి పోయింది.

జేవురు రంగులో ఉన్న వీరయ్య ముఖాన్ని చూసి "ముఖం ఎందుకు అట్లుందే" అన్నాడు శివ.

వీరయ్య సమాధానం చెప్పలేదు.

"మామా కోడలు నా ఎనకాల గుంతలు తవ్వతాండారా.. హ్హా హ్హా హ్హా. తవ్వినా ఆ గుంతల్లో పడేది మీరేలే.. నాకేం కాదు" అన్నాడు.

"రేయ్.. నీకు శివా అని పేరెందుకు పెట్టినామో తెలుసా?" కొడుకును అడిగాడు వీరయ్య.

"దేవుడి పేరు.. మీకు శివుడంటే భక్తి. అందుకే కదా" సమాధానం చెప్పాడు శివ.

కాదన్నట్టు తల అడ్డంగా ఊపుతూ "శివుడి వాహనం నంది. నంది అంటే కోడెగిత్త. సేద్యం చేయాలంటే కోడెగిత్తలు ఉండాల్సిందే. మన ఇల్లు కోడెగిత్తలతో, పిల్లా పాపలతో చల్లగా ఉండాలని ఎప్పుడూ ఆ శివుడిని కోరుకునేది మీ అమ్మ. మనకు ఆదరువుగా ఉండే కోడెగిత్తల యజమాని శివుడు. అందుకనే నీకు శివుడి పేరు పెట్టినాం. అది కేవలం దేవుడి పేరు కాదు.. మా బతుకు పేరు" అన్నాడు వీరయ్య.

"ఎప్పుడూ ఎద్దులు కోడెగిత్తలు.. అయ్యి లేకుంటే మనం ఇట్లుండే వాళ్లం కాదు.. ఎంతకాలం ఈ మాటలు. ఎద్దుల్లేకుంటే మనుషులు బతకలేని కాలం పోయింది. ఇప్పుడు మనుషుల్లేకుంటే ఎద్దులు బతకలేవు. అయినా వాటికి నేనేమి తక్కువ చేస్తాండాను. దినమ్మా బాదం, జీడిపప్పులు, చెనిగ్గింజల ఉంటలు, బెల్లం ముద్దలు, బలానికి దున్నపోతు మాంసంతో కీమా.. అప్పుడప్పుడు రమ్మూ.. ఇంత తిండి వాటికి యాడ దొరకతాది"

"నీకూ ఆ మాదిర్తో దినమ్మా తిండి పెట్టి.. చెర్నాకోలతో కొడితో ఒప్పుకుంటావా?" కొడుకు కళ్లల్లోకి సూటిగా చూస్తూ ప్రశ్నించాడు వీరయ్య.

"ముసిలోడా.. నీకు మతిపోతాండాది.. మనిషీ గొడ్డూ ఒకటి ఎట్లయితాయి.. మ్మేయ్.. ఎంతసేపు పెడతావు టీ" అరిచాడు భార్యను.

“అయిపోయింది.. తెస్తాండా" అంటూ ప్లేటులో టీ గ్లాసులతో వచ్చింది శాంత. ఆ ప్లేటు ఎడమ చేత్తో తీసుకుని, వీరయ్యను చూసి "ఖర్మ ఖర్మ" అంటూ కుడి చేత్తో తల కొట్టుకుని వీధిలోకి వెళ్లాడు శివ.

“ఇట్లే వదిలేయకూడదమ్మా.. ఏదన్నా చేయాల" కోడలిని చూస్తూ మెల్లిగా అన్నాడు వీరయ్య.

మనం ఏమీ చేయలేమన్నట్టుగా అరచేతిని ఊపి వంటగదిలోకి వెళ్లిపోయింది శాంత.

దబదబా తలుపు చప్పుడుతో శివకు మెలకువ వచ్చింది. గదిలో చీకటి, పక్కన పడుకున్న శాంత కూడా ఆ చప్పుడుకు లేచి కూర్చుంది. మొబైల్ ఫోన్లో టైమ్ చూశాడు. ఐదుగంటలు..

తలుపును బాదుతూ "అన్నా.. శివన్నా" అంటూ గట్టిగా అరుస్తున్నాడు అహ్మద్.

"ఏమైందిరా" అంటూ శివ వచ్చి తలుపు తెరిచాడు.

"నాన్నా.. షెడ్డులో ఎద్దులు లేవు" అన్నాడు.

తను విన్నది నిజంకాదనుకున్నాడు శివ. “ఏందీ" అన్నాడు.

"మన ఎద్దులు లేవు.. షెడ్డులో ఎద్దులు లేవున్నా" అన్నాడు అహ్మద్. అతడి గొంతులో భయం. దుఃఖం.

“యాడికి పోతాయిరా.. నువ్వు ఆన్నే పడుకొన్నేవు కదా" షెడ్డుకాడికి ఉరికినట్టుగా పోతూ.. కోపంగా అడిగాడు శివ.

"రేత్తిరి కోర్టరేసుకోని పొనుకున్నే. మెలకువ లేదు. పద్దన్నే కుక్కలు మొరగతాంటే మెలకువొచ్చింది. చూస్తే ఎద్దులు లేవు" అన్నాడు అహ్మద్.

"నీయ.. ఎప్పుడు ఏం చేయాలో తెలీదారా నీకు.. వద్దన్నే పందెం పెట్టుకుని రేత్తిరి ఎవురైనా తాగతారా.. నువ్వు తాడు ముడేస్తే ఆ దేవుడొచ్చి ఇప్పినా ఊడదన్నేవు కదరా.. తాళ్లు ఈన్నే ఉండాయి. ఎవురిప్పినారు వాటిని" కోపంగా అరిచినట్టు అన్నాడు శివ. అహ్మద్ సమాధానం చెప్పకుండా తలొంచుకున్నాడు.

"మనోళ్లకు ఫోన్ చేసి చెప్పు. తలా ఒగదిక్కు పోయి తాలాడండి" అన్నాడు శివ.

శాంత కూడా అక్కడికి వచ్చింది. ఆమె కళ్లల్లో ఏదో తెలీని సంతోషంతో కూడిన మెరుపు. భార్యను చూడగానే శివకు అనుమానం వచ్చింది. “నీకేమన్నా తెలుసా” అడిగాడు గట్టిగా.

"నాకేం తెలస్తాది. నేనూ నీతోపాటే రాత్రి పడుకున్నే"

"మా నాయన యాడుండాడు".

"మామ వద్దన్నే వాకింగు పోయింటాడు"

"వాకింగా.." ఆశ్చర్యంగా అడిగాడు శివ.

"అవును.. మామ రెండు నెలల నించి మిద్దెపైన పడుకుంటా ఉండాడు. రోజూ పద్దన్నే ఐదుగంటలకు లేచి వాకింగు పోతాండాడు. రెండుగంటలకు పైగా నడస్తాండాడు" అంది శాంత.

కోడెగిత్తలు ఎక్కడికి పోయాయో శాంతకు కూడా తెలీదు. కానీ అవి మాయం కావడం వెనుక మామ పాత్ర ఉండాలని ఆమె కోరుకుంటా ఉంది.

"నీయ.. చెప్తాండా.. వాటిని నువ్వే యాడికన్నా తోలేసినావని తెలిసిందనుకో.. నిన్ను చంపేసి గాట్లోనే పూడ్చేస్తా.. బంధువులకు, ఫ్రెండ్సందరికీ చెప్పేసిండా. ఈ పొద్దు పోటీలో పాల్గొనకపోతే పరువు పోతాది.." అంటూ కోడెగిత్తలను వెతికేదానికి బయలుదేరాడు శివ.

వెతికారు.. వెతికారు..

ఫోన్లు చేశారు.. ఫోన్లు చేశారు.

గంట.. రెండు గంటలు.. మూడుగంటలు..

సమయం గడుస్తోందే కానీ కోడెగిత్తల ఆచూకీ దొరకలేదు. మార్నింగ్ వాక్ వెళ్లిన వీరయ్య ఇంకా ఇంటికి రాలేదు.

శివకు తండ్రిమీద అనుమానం వచ్చింది.

కోడెగిత్తలు ఊరుదాటి చాలా సేపయింది. పెన్నానది ఒడ్డున అడవిలో ముందు వీరయ్య.. వెనక కోడెగిత్తలు వేగంగా నడుస్తున్నాయి. ఉదయం ఎనిమిది గంటలయినా.. దట్టంగా కమ్ముకున్న పొగమంచులో సూర్యుడు చంద్రుడిలా కనిపిస్తున్నాడు. కీర్తిమునకలో ఉన్న మనుషులను బయటకు తీసుకు రావడానికి కోడెగిత్తలతో కలసి వెళుతున్న వీరయ్య మబ్బులు వీడిన తొలిపొద్దులా ఉన్నాడు.

★★★★